# అడల్ట్స్ ఓన్లీ కథ




# వెడ్ లాక్

సురేష్‌కి మూడు సంబంధాలొచ్చాయి.

ఒకటి లావణ్య. ఆమెది చెప్పుకోత్గ అందం. కుటుంబం సంప్రదాయమైనది.

రెండు ధవళ. ఆమెది కొంత అందం, కొంత ఆకర్షణ. కుటుంబం సంప్రదాయమైనది.

మూడు మేనక. ఆమెది కేవలం ఆకర్షణ. సంప్రదాయాన్ని నమ్మదనిపించేటంత ఫాస్టుగా ఉంటుంది. కట్నాల సంతలో నిలబడ్డ వరుణ్ణి పోటీపడి ఎంతకైనా కొనగల డబ్బుంది.


ఈ ముగ్గుర్లో ఎవర్ని చేసుకోవాలా అని అతడూగిసలాడుతుంటే ఈలోగా లావణ్య పెళ్ళైపోయింది- ఓ అమెరికాలో అబ్బాయితో. ఇప్పుడామె మగడెప్పుడు ఎగరేసుకుపోతాడా అని ఎదురుచూస్తోంది. దాంతో తల్లిదండ్రులు త్వరపడమని సురేష్ పై ఒత్తిడి తేసాగారు.

సురేష్ తల్లిదండ్రులు ప్రాక్టికల్ మనుషులు. డబ్బు ముందు- నీతి, సంప్రదాయం కొరగానివని నిర్మొహమాటంగా చెబుతారు. అందం కొరుక్కుతింటామా అనీ అంటారు. వాళ్ళ ఓటు మేనకకేనని సురేష్‌కి మొదట్నించీ తెలుసు.

ఇరవయ్యేడేళ్ళకే నెలకు ముప్పై వేలు సంపాదిస్తున్న సురేష్‌కి.. డబ్బు ప్రాముఖ్యత ఇంకా ఆకళింపు కాలేదు. వయసులో ఉన్నాడేమో- అందం కొరుక్కుతినాలనే అనిపిస్తోంది. నిజానికతడికి లావణ్యనే పెళ్ళాడాలని ఉండేది. కానీ పక్కింట్లోనే ఉంటున్నా ఆమె అంతరంగం తెల్సుకునే ప్రయత్నం చెయ్యలేదు. తనకంటే ఎన్నోరెట్లు అందమైన లావణ్య తనని చిన్నచూపు చూస్తుందని భయపడ్డాడు కానీ తీరా చూస్తే ఆమె అమెరికా భర్త అందంలో సురేష్‌కి బాగా తీసికట్టు.

ఇప్పుడతడికి ధవళను పెళ్ళి చేసుకోవాలనుంది. కానీ తల్లిదండ్రుల దృష్టి మేనక డబ్బుమీదుంది.

''నేటి పెద్దలు-ఎదిగిన పిల్లలకు సలహాలివ్వడానికి తగరు. కాబట్టే పెళ్ళికి-పెద్దల సలహా వద్దు గురూ, స్నేహితులే మరి సో బెటరూ'' అని పాడు



వసుంధర

తుంటాడతడి స్నేహితుడు వర్ధన్. లావణ్య చేయి దాటిపోయేక ఉన్నపళంగా వెళ్ళి అతగాణ్ణి ఆశ్రయించాడు సురేష్.

సురేష్ వయసువాడే అయిన వర్ధన్ కంప్యూటర్ ప్రోగ్రామర్‌గా స్వంత సంస్థ నడుపుతున్నాడు. పెళ్ళై మూడేళ్ళైంది. అప్పట్నించీ మునుపటి కంటే చాలా సంతోషంగా ఉన్నాడని అంతా అంటారు. సురేష్ తన డైలమా చెప్పగానే, ''ముందే నా దగ్గరకొస్తే నీకు లావణ్యే దక్కేది. ఇప్పుడిక ధవళతో సరిపెట్టుకో'' అంటూ వెంటనే సలహా ఇచ్చేసాడు.

''నేను మేనకనెందుకు పెళ్ళి చేసుకోకూడదు?'' అడిగాడు సురేష్.

''ఎందుకంటే మనమింకా ఫాస్ట్ అమ్మాయిల్ని భరించే స్థాయికి ఎదగలేదు'' అన్నాడు వర్ధన్.

''ఫాస్ట్ అమ్మాయిలైతే ఏం చేస్తారు?'' అడిగాడు సురేష్.

''సంప్రదాయం పాటించే పిల్లలైతే ప్రిడిక్టబుల్‌గా ఉంటారు. ఫాస్ట్ అమ్మాయిలేం చేస్తారో చెప్పలేం''

## కొత్త సీసాలో పాత సారా!

పాత హిట్ చిత్రాల్ని తిరిగి నిర్మించడం అనేది బాలీవుడ్ లేటెస్ట్ ట్రెండ్‌లా వుంది. అమధ్య 'దేవదాసు'ని మళ్లీ తీసారు. బ్లాక్ అండ్ వైట్ సినిమా 'మొఘల్-ఎ-ఆజమ్'కి రంగులు అద్ది రిలీజ్ చేశారు. ఇలా మరికొన్ని వస్తున్నాయి. ప్రముఖ దర్శకుడు జె.పి.దత్తా- దాదాపు ఇరవై ఏళ్ల క్రితం రేఖ హీరోయిన్‌గా వచ్చిన 'ఉమ్రావ్ జాన్' సినిమాని ఇప్పుడు ఐశ్వర్యా రాయ్ హీరోయిన్‌గా పునర్నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నాట్ట. ఇందుకుగాను రేఖ ధరించిన పాత్రని పోషించడానికి ఐశ్వర్యా రాయ్ ఆల్రెడీ అంగీకారం తెలిపింది. హీరోగా ఆనాటి చిత్రంలోని ఫరూక్ షేక్‌కి బదులుగా నేడు అభిషేక్ బచ్చన్ నటించవచ్చునట.



''ఆ అమ్మాయిలు శీలానికి ప్రాధాన్యమివ్వరంటావా, సూటిగా చెప్పు'' అన్నాడు సురేష్.

''తప్పురా. అసలీ ఇరవై ఒకటో శతాబ్దంలో మనం శీలం గురించి మాట్లాడ్డం సంస్కారం కాదు. ఐనా తప్పంటూ జరిగితే అది స్పీడులోనే కాదు, సంప్రదాయంలోనూ సాధ్యమే. నేనదేమిటంటే సంప్రదాయంలో ఉండే బంధం, అనుబంధం చాలా ప్రత్యేకం. స్పీడులో అవసరానికున్న ప్రాధాన్యం ఆత్మీయతకుండదు. ఉదాహరణకు నేను జానకిని ప్రేమించాను, తెలుసు కదా!'' అన్నాడు వర్ధన్.

సురేష్‌కి ఆ ప్రేమకథ తెలుసు.

మన సంప్రదాయం శృంగారాన్ని వక్రదృష్టితో చూడ్డం వల్ల చాలామంది అమ్మాయిల్లో ఫ్రిజిడిటీ ఉంటుంది. వర్ధన్ మేనమామ కూతురు జానకిది అదే కేసు. చాలా అందగత్తె అయిన ఆమె అంటే వర్ధన్‌కి ప్రాణం. ఫ్రిజిడిటీ కారణంగా ఆమె పెళ్ళికే విముఖంగా ఉందని తెలిసి అప్సెట్టయ్యాడు. జానకిలో ఫ్రిజిడిటీని పోగొట్టడానికి ఆర్నెలలపాటు పరిశోధనలు చేసి ఓ వెడ్‌లాక్ కిట్ తయారుచేసాడు. అది సత్ఫలితాలనివ్వడంతో అతడామెను పెళ్ళి చేసుకున్నాడు. హాయిగా ఉన్నాడు.

''ఔను. నువ్వు జానకిని సంప్రదాయం చూసే ఇష్టపడి, కష్టపడి పెళ్ళి చేసుకున్నావని నాకు తెలుసు. కానీ వెడ్‌లాక్ వివరాలు తెలియవు'' అన్నాడు సురేష్.

''వెడ్‌లాక్ సెట్లో మొత్తం మూడు వస్తువులున్నాయి. ఒకటి డిజీవిజీ. అదో చిన్న పుస్తకంలా ఉంటుంది. మామూలుగా చూస్తే అందులో పురాణకథలుంటాయి. ముందుగా ప్రోగ్రాం చేస్తే అనుకున్న టైమ్‌కి కంటెంటు మారుతుంది. ఇష్టమైన అమ్మాయికా పుస్తకాన్నిచ్చి చదువుకోమంటే చదివే టైముకి కామసూత్రాలు బొమ్మలతో సహా కనపడేలా చేయొచ్చు. అవి చూస్తే అమ్మాయి లైన్లో పడడం గ్యారంటీ. తర్వాత ఫిర్యాదు చేద్దామన్నా అది పురాణకథల పుస్తకం కాదని ఋజువు చేయడం ఆమె తరం కాదు. రెండు ఆడిటికా. అదో మ్యూజిక్ సీడీ. ప్లే చేస్తే ఆడవాళ్ళు మాత్రం ఉద్రేకపడే సంగీతధ్వనులొస్తాయి. అమ్మాయిలు రెచ్చిపోతారు కానీ తామెందుకు రెచ్చిపోతున్నదీ తెలుసుకోలేరు. మగాళ్ళకది మామూలు సంగీతంలా ఉంటుంది. మూడు లవ్‌ఫ్రాగ్. అది తాయెత్తులా ఉంటుంది. దాని మీట నొక్కితే ఆడవాళ్ళకు మాత్రం ఉద్రేకం పుట్టించే పరిమళం వెలువడుతుంది. అబ్బాయి దాన్ని చేతికి కట్టుకుని ఏకాంతంలో అమ్మాయి దగ్గర ప్రయోగిస్తే షేన్‌వార్న్ గురించి లారా చెప్పింది రివర్సు గేర్లో జరుగుతుంది'' అన్నాడు వర్ధన్.

''మధ్య క్రికెటర్ షేన్ వార్న్ ఎందుకొచ్చాడు?''

అన్నాడు సురేష్ ఆశ్చర్యంగా.

''ఆ..ఏదో గాలివార్తనుకో. అతగాడు ఇంగ్లండులో లౌరా అనే యువతి వద్దకెళ్ళి బట్టలన్నీ విప్పుకుని ఆమె కాళ్ళమీద పడి సెక్సు కావాలని కోర్టాట్ట. ఆమె అతణ్ణి వదుల్చుకుందుకు కండోముందా అనడిగిందిట. అతగాడు అప్పటికప్పుడు పరుగున బైటకెళ్ళి క్షణాల్లో కండోమొకటి సంపాదించుకొస్తే లౌరా మరి కాదనలేకపోయిందిట. పేపర్లో చదవలేదా?''

''లేదులే కానీ నీ వెడ్‌లాక్ కిట్ నాకేమైనా పనికొస్తుందా చెప్పు?'' అన్నాడు సురేష్.

''నేనీ కిట్‌ని పెళ్ళైన వాళ్ళకోసం ఉద్దేశించాను. నేను జానకిమీద వాడినా చిన్నప్పట్నించీ ఆమె నా పెళ్ళామనే అనుకున్నాను కాబట్టి ఫరవాలేదు'' అన్నాడు వర్ధన్ సాలోచనగా.

ఉన్నట్లుండి, ''నేనిది లావణ్య మీద ప్రయోగించొచ్చా?'' అన్నాడు సురేష్.

''నీ ఆలోచనలు తప్పుదారిలో వెడుతున్నాయి. నా వెడ్‌లాక్ విడిపోయిన దంపతుల్ని కలపడానికి. దంపతులు చెడిపోయి విడిపోవడానిక్కాదు'' అన్నాడు వర్ధన్.

''నేనెలాంటి వాణ్నో నీకు తెలుసు. నన్ను నుమానించకుండా నేను చెప్పేది విను. ఆమెది మా పక్కిల్లు. పెళ్ళై భర్తకు దూరంగా ఉంటోంది. ఒకప్పుడు మా ఇద్దరికీ అనుకున్నారు కాబట్టి నాకామె మనసులో ఏ మూలో స్థానముండకపోదు. ఆమెకూ నాకూ మాట్లాడుకునే చనువుంది. ఆమె అలవాట్లూ అవీ నాకు బాగా తెలుసు. నీ వెడ్‌లాక్‌ని ప్రయోగించడానికి నాకామె అన్ని విధాలా అనుకూలం. మనసు వశం తప్పితే సంప్రదాయాన్ని నమ్మే వివాహిత యువతి ఎంతవరకూ దిగజారగలదో తెలుసుకుందుకు మాత్రమే నేనీ ప్రయోగం చేస్తాను. ఆమె జయిస్తే నాకూ ధవళకూ పెళ్ళి. ఓడిపోతే నేను మేనకను పెళ్ళి చేసుకుంటాను'' అన్నాడు సురేష్.

వర్ధన్ కాసేపాలోచించి సురేష్ ఎడమచేతికి లవ్ ఫ్రాగ్ తాయెత్తులా కట్టాడు. మిగతా రెండు వస్తువులూ కూడా ఇచ్చి, ''నేను నిన్ను నమ్ముతున్నాను. ఐతే ఒక్క విషయం గుర్తుంచుకో. నువ్వు లావణ్యమీద ముందు డిజీవిజీ ఉపయోగించు. తర్వాత ఆడికొకా ఉపయోగించడానికి కనీసం పన్నెండు గంటల వ్యవధి ఉండాలి. ఆ తర్వాత లవ్ ఫ్రాగ్ ఉపయోగించాలంటే కనీసం రెండు గంటల గ్యాపుండాలి. ఓకే. ఆల్ ది బెస్ట్!'' అన్నాడు.

★ ★ ★

మిత్రుడిచ్చిన వస్తువులను పరీక్షించాలని సురేష్ అనుకోలేదు. కానీ అనుకోకుండా డిజీవిజీకి టెస్ట్ జరిగిపోయింది. ఏదైనా పుస్తకముంటే తీసుకుందామని అతడి గదిలోకొచ్చిన జగదాంబకి డ్రాయర్ సొరుగులో డిజీవిజీ కనిపిస్తే- అది నిజంగా పురాణ కథల పుస్తకమనుకుని తీసుకెళ్ళింది. భర్త తొమ్మిదింటికే పడుకుంటే తనకు నిద్ర రాక చదవడం మొదలెట్టింది. టైము తొమ్మిదింపావయ్యేసరికి అందులో కామసూత్రాలు ప్రత్యక్షమయ్యాయి. ఆ రాతలు, ఆ బొమ్మలు ఆమె నలభై ఏళ్ళ వయసునీ ఇరవైకి తగ్గించేసాయి. ఆమె కలవరపడి ఆ పుస్తకాన్ని మళ్ళీ మరిది గదిలో తీసిన చోటే పెట్టేసి వచ్చింది. ఆ తర్వాత ఆమె భర్తకు నిద్ర లేదు.

సురేష్ పెద్దన్న ఈశ్వర్రావుకి తన మధురానుభూతుల్ని ఎదురింటి పుల్లారావుతో పంచుకునే అలవాటుంది. ఈ అనుభవాన్నీ ఆయన పుల్లారావుతో పంచుకోబోతే-పుల్లారావు నమ్మలేక, ''భక్తికథల పుస్తకంలో బూతుబొమ్మలెలాగొస్తాయోయ్-మీ ఆవిడ కథలు చెబుతోంది'' అన్నాడు.

''మా ఆవిడకు కథలు చదవడమే కానీ చెప్పడం రాదు. ఆ పుస్తకం తమ్ముణ్ణడగలేను కదా! నువ్వే ఏదో వంకన వాణ్ణడిగి తీసుకుని నువ్వుపయోగించుకుని నాకింకోసారివ్వు'' అన్నాడు ఈశ్వర్రావు. పుల్లారావుకి సురేష్ దగ్గర చనువెక్కువే. ఆ సాయంత్రమే ఆయన అతణ్ణా పుస్తకం గురించి సూటిగానే అడిగేసాడు. జరిగింది తెలిసి గతుక్కుమన్న సురేష్ ఆయనతో తన దగ్గర అలాంటి పుస్తకమేదీ లేదని ఖచ్చితంగా చెప్పేసాడు.

''నేనూ అంతే అనుకున్నాన్లే'' అని పుల్లారావు ముసిముసిగా నవ్వుకుని వెళ్ళిపోయాడు. కాస్త వయసైన ఆడవాళ్ళు నోరువిడిచి అడగలేక ఏవో కల్పించి చెప్పడం ఆయనకు స్వానుభవమే.

★ ★ ★

ఈలోగా సురేష్‌కి ఆడికొకాని కూడా పరీక్షించే అవకాశం వచ్చింది.

అతడి కస్టమర్ నలభై ఏళ్ళ నారాయణకు వారం రోజులుగా పెళ్ళాంతో మాటల్లేవు.

''తప్పునాదేనయ్యా. కానీ ఒప్పుకున్నా శాంతించదే. పెళ్ళాల్ని మంచి చేసుకునేందుక్కూడా నీ దగ్గరేదైనా కంప్యూటర్ ప్రోగ్రాముంటే బాగుణ్ను'' అన్నాడాయన సురేష్‌తో బాధగా.

''అలాంటి ప్రోగ్రాం నా దగ్గరుంది. అదేంటని అడగొద్దు. ఈ సాయంత్రం నీ యింటికొస్తాను. కాఫీ తాగి ఓ అరగంటుంటాను. నీ ప్రోబ్లం సాల్వైతే ఫోన్ చేసి చెప్పు'' అన్నాడు సురేష్.

నారాయణ అతడి వంక అపనమ్మకంగా చూసి, ''ప్రోబ్లం కనుక నిజంగా సాల్వైతే- ఫోన్ చేయను. సరాసరి నీ యింటికొచ్చి నువ్వడిగిందిస్తాను'' అన్నాడు.

ఆ సాయంత్రం సురేష్ సీడీ ప్లేయర్లో ఆడికొకాని లోడ్ చేసుకుని నారాయణతో కలిసి అతడింటికెళ్ళాడు. తలుపు తీసిన కనకమ్మ ముఖం ధుమధుమలాడుతోంది. ఆమె సురేష్‌ని చూసి మర్యాదకి పొడిపొడిగా మాట్లాడింది. లోపల కూర్చున్నాక కాఫీ తెచ్చిచ్చి అసహనంగా కూర్చుంది. సురేష్ కాఫీ సిప్ చేస్తూ సిడీ ప్లేయర్ ఆన్ చేసాడు. ఓరకంట ఆమెను గమనిస్తూ నారాయణతో కబుర్లాడు తున్న సురేష్‌కి పది నిముషాల్లోనే కనకమ్మ ముఖంలో అసహనం పెరిగినట్లు తెలిసింది. ఈ అసహనానికి కారణం ఊహించడానికి

## బెంగాలీ తెరపై మనీషా

**నేపాలీ భామ మనీషా కొయిరాలా హిందీ చిత్రాలతోపాటు తెలుగు, తమిళ సినిమాల్లోనూ హీరోయిన్‌గా నటించింది. ఆమె గ్లామర్‌ని ఇప్పుడు బెంగాలీ ప్రేక్షకులు కూడా చూడబోతున్నారు. అలనాటి హీరో బిశ్వజిత్ కొడుకు ప్రసంజిత్ హీరోగా నటిస్తున్న ఓ బెంగాలీ సినిమాలో మనీషా కొయిరాలా నాయికగా నటించడానికి అంగీకరించింది. 'ఈ సినిమా నాకు ఎంతో పేరు తెస్తుందని భావిస్తున్నాను' - అని సంబరపడుతోంది మనీషా.**



అనుభవం అవసరం లేని కాలమిది.

అన్న ప్రకారం సురేష్ అరగంట తర్వాత తన సీడీ ప్లేయర్ తీసుకుని వెళ్ళిపోయాడు. కానీ అన్న ప్రకారం నారాయణ మాత్రం అతడికా రాత్రి ఫోన్ చెయ్యలేదు. మర్నాడుదయం సెల్‌కి ఫోన్ చేసి, ''నువ్వేం చేసావో నాకు తెలియదు కానీ చాలా చాలా థాంక్సయ్యా- నేనూ మా ఆవిడా మళ్ళీ ఫ్రెండ్సైపోయాం. నిన్న నువ్వెళ్ళినప్పట్నించీ నాకు తీరుబడి దొరకలేదు. రాత్రంతా నిద్రలేదు'' అంటూ సంజాయిషీ కూడా ఇచ్చాడు.

★ ★ ★

సురేష్‌కి లవ్‌ఫ్రాగ్‌ను పరీక్షించే అవకాశాన్ని మధు ఇచ్చాడు.

మధుకి బాగా డబ్బుంది. పేదింటిపిల్ల సుకన్యని పెళ్ళి చేసుకున్నాడు. ఆమె కంప్యూటర్ నేర్చుకుంటానంటే రెండేళ్ళక్రితం మధు సురేష్ సాఫ్ట్‌వేర్ ఆఫీసుకొచ్చాడు. అప్పట్నించీ ఇద్దరూ మంచి స్నేహితులు.

మధుకి భార్యంటే ప్రేమున్నా డబ్బుందని అహంకరించి తరచుగా ఆమెని చిన్నబుచ్చేవాడు. సుకన్య ఆత్మాభిమానంతో ఎదురుతిరిగితే ఇంకా రెచ్చిపోయేవాడు.

నా అన్నవాళ్ళు తననాదుకోరని తెలిసిన సుకన్య కంప్యూటర్ నేర్చుకుని సురేష్ ఆఫీసులోనే చిన్న ఉద్యోగం సంపాదించింది. మధు ఉద్యోగం చేయొద్దంటే ఆమె తనకాళ్ళమీద నిలబడతానని పట్టుబట్టింది. చిలికిచిలికి గాలివానై ఇద్దరూ విడాకులదాకా వెళ్ళారు. ఒక ఏడాది విడిగా ఉండి ఆ తర్వాతే విడాకుల గురించి ఆలోచించమని శ్రేయోభిలాషులు హితవు చెప్పారు.

ఆర్నెల్లయింది. సుకన్య లేకుండా తాను బ్రతకలేనని ఇప్పుడు మధుకి అనిపిస్తోంది. ఐతే సుకన్య అతణ్ణి దరిదాపులకు రానివ్వడంలేదు. ఇది చెప్పుకుని సురేష్ వద్ద బాధపడుతూంటాడతడు.

ఒక్కసారి ఆ దంపతులను కలిపితే వారి బంధం శాశ్వతమౌతుందని సురేష్‌కి తెలుసు. అందుకని అతడు మధు డబ్బుతోనే ఓ హోటల్ రూంలో చిన్నపార్టీ ఏర్పాటు చేసాడు. ఆహ్వానితుల్లో మధు, సుకన్య కూడా ఉన్నారు.

పార్టీ అయేక అతడు విడివిడిగా మాట్లాడి ఒకో అతిథినే పంపేసాడు. చివరకు అతడు, మధు, సుకన్య మిగిలారు. అప్పుడతడు తన చేతికున్న లవ్‌ఫ్రాగ్ మీటనొక్కి వాళ్ళతో కబుర్లు ప్రారంభించి ఓరకంట సుకన్యనే గమనించసాగాడు. మధు కూడా సుకన్యనే గమనిస్తూ ఆమె ముఖభావాల్లోని మార్పుకు అర్థం గ్రహించి ఆమెను పలకరించే ధైర్యం చేసాడు. ఆమె ప్రసన్నంగా బదులివ్వగానే, ''సుక్కూ! నీతో మాట్లాడాలి నాతో వస్తావా?'' అన్నాడు.

వెంటనే, ''ఎక్స్‌క్యూజ్‌మీ'' అంటూ సురేష్ వంక చూసి లేచి నిలబడింది సుకన్య.

సురేష్ వాళ్ళకు బై చెప్పాడు.

మర్నాడు మధు సురేష్‌కి ఫోన్ చేసి తనూ, సుకన్యా విడాకుల ఐడియా డ్రాప్ చేసామని చెప్పాడు.

★ ★ ★


ఇక లావణ్య వంతువచ్చిందనుకున్నాడు సురేష్. అతడి అలవాట్లు లావణ్యకీ, లావణ్య అలవాట్లు అతడికీ బాగా తెలుసు. సంబంధం అనుకోక ముందునించీ కూడా ఇద్దరూ కలివిడిగా మాట్లాడుకునేవారు. ఆ అమ్మాయి ఫాస్టు కాదు. అతడికి స్పీడు లేదు. లేకుంటే ఈపాటికి వాళ్ళు దంపతులయ్యేవారేమో కూడా.

లావణ్యరోజూ రాత్రి తొమ్మిది దాకా టీవీ చూస్తుంది. అప్పుడు మంచమెక్కి పుస్తకం తీసి నిద్రపట్టేదాకా చదువుతుంది. అందుకే డిజీవిజీలో అతడు కామసూత్రాలను రాత్రి తొమ్మిదింపావుకి సెట్ చేసాడు. దాన్ని లావణ్యకెలా అందజేయాలా అని అతడనుకుంటూండగా- అతడి మనసు చదివినట్లుగా ఆ సాయంత్రమే లావణ్య అతణ్ణి ఇంట్లో కలుసుకుని ఏమైనా పుస్తకాలిమ్మంది. అలా అప్పుడప్పుడతణ్ణి అడగడం ఆమెకు మామూలే కాబట్టి అతడామెకు వెంటనే డిజీవిజీ ఇచ్చి, ''ఇవి పురాణకథలేకానీ యువతకు నచ్చేలా రాసారు. ఈ పుస్తకం రేపే నేను వాపసిచ్చేయాలి కాబట్టి చదివి రేపే నీ అభిప్రాయం చెప్పాలి'' అన్నాడు.

ఆమె డిజీవిజీ తీసుకుని వెళ్ళేక ఆ రాత్రంతా- ఆ పుస్తకం ఆమెపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందీ, రేపామె తనతో ఎలా రియాక్టౌతుందీ- అన్న ఆలోచనలతో అతడికి సరైన నిద్రలేదు.

మర్నాడుదయం నుంచి అతడు లావణ్యకోసం ఎదురుచూస్తూనే ఉన్నాడు. ఆఫీసుకెళ్ళినా పనిమీద దృష్టి పెట్టడానికి చాలాసేపు పట్టింది. సాయంత్రం ఐదైనా రోజులా సీట్లోంచి లేవలేదు. ఇంటికెడితే లావణ్య వచ్చి పెద్ద రగడ చేస్తుందని అతడికి భయంగా ఉంది.

టైము ఏడు కావస్తోంది. ఇక లేద్దామని సురేష్ అనుకుంటూండగా అతడి క్యాబిన్లోకి లావణ్య వచ్చింది. అతడి ఎదుటి సీట్లో కూర్చుని తన వ్యానిటీబాగ్‌లోంచి డిజీవిజీ తీసి



## కలిసొస్తున్న కాలం!

**తెలుగు అమ్మాయి లయ ఇప్పుడు తెలుగులో కంటే మలయాళం, తమిళ చిత్రాల్లో బిజీగా వుందనే సంగతి అందరికీ తెలుసు. ఈ సమయంలో ఆమెకి ఓ తెలుగు చిత్రంలో నాయికగా నటించే చాన్స్ వచ్చింది. కోడి రామకృష్ణ రూపొందించే 'దేవతలు' సినిమాలో యువ హీరో రిషి (ఏ ఫిలిం బై అరవింద్ ఫేం)కి జంటగా నటింబోతోంది. ఇదే కాకుండా ఓ టాప్ హీరో సినిమాలో కూడా లయకి హీరోయిన్ చాన్స్ లభించనున్నట్టు టాలీవుడ్ సమాచారం. అంటే లయకి తెలుగులో తిరిగి మంచి రోజులు వస్తున్నాయన్నమాట. మంచిదే కదా!**

అతడి టేబిల్‌మీద పెట్టేంది. ఆమె ఏమంటుందోనని అతడు కంగారుపడ్డాడు కానీ ప్రసన్నంగా నవ్వింది.

''నిజానికి నాకు కోపం రావాలి. కానీ ఎందుకో రాలేదు'' అందామె.

కూల్‌డ్రింక్సు కోసం అతడు వాచ్‌మన్ని పిలవబోయాడు.

''నేను హాట్‌గా ఉన్నమాట నిజం. కానీ కూల్ అవాలనుకోవడం లేదు'' అంటూ అతణ్ణి వారించి, ''థాంక్స్ ఫర్ ఏ నైస్ అండ్ టైమ్లీ బుక్. నాకు తెలియనివి చాలా తెలిసాయి'' అందామె.

తానిదివరకెరుగని ఆ చనువుకి అతడు తడబడ్డాడు. ఆపైన ఇన్హిబిషన్స్ లేకుండా మాట్లాడుతున్నందుకు ఆశ్చర్యపడ్డాడు.

''ఏమిటో, డెసిషన్ లేట్ చేసావు. ఈలోగా అమ్మానాన్నా తొందరపడ్డారు. నాకేం అమెరికా వెళ్ళాలని లేదు. ఆయనక్కడ, నేనిక్కడ. ఇంకా ఇలా ఎన్నాళ్ళో. మనం పెళ్ళి చేసుకునుంటే ఈపాటికి ఇక్కడే లైఫ్ ఎంజాయ్ చేస్తూ ఉండేవాళ్ళం'' అని నిట్టూర్చిందామె.

పుస్తకం పనిచేసిందని గుర్తించిన సురేష్ చటుక్కున టేబిల్‌మీదే ఉన్న సీడీ ప్లేయర్ ఆన్ చేసాడు. లావణ్యతో కబుర్లు చెబుతూనే క్రమంగా ఆమె ముఖంలో వస్తున్న మార్పులు గమనించాడు. కాసేపటికామె ''నువ్వు చాలా హాండ్సమ్'' అంది.

''మరెవరైనా ఈ మాటంటే అది పొగడ్త. నువ్వంటే మర్యాద'' అన్నాడు సురేష్.

''ఈరోజు మాయింట్లో అంతా సెకండ్‌షో ప్రోగ్రాం పెట్టారు. నేనెలాగో తప్పించుకుంటాను. రాత్రి పదింటికల్లా మీ యింటివైపు తలుపు తీసుంచుతాను. నువ్వొస్తావు కదూ?'' అందామె సాలోచనగా.

లావణ్య సహకరిస్తే వాళ్ళింటికి రాత్రిపూట వెళ్ళడం అంత సులభమని అప్పుడే అతడికి స్ఫురించింది. కానీ ఆమె అంత సూటిగా అడిగేసరికి తడబడి, ''ఎందుకు?'' అన్నాడు.

ఆమె లేచి నిలబడి, ''రాత్రి తొమ్మిదింపావుకి డిజీవిజీ చదువు. తలుపులు బిడ్డలుకొట్టి మరీ మా యింటికొస్తావు'' అనేసి వెళ్ళిపోయింది.

ఎన్నో ఏళ్ళుగా పరిచయమున్నా ఒక్కసారి కూడా కనీసం ప్రేమ అన్నమాట కూడా తన ముందు ఉచ్చరించని లావణ్య ఈరోజు ఎంత సూటిగా- ఇంకా చెప్పాలంటే ఎంత పచ్చిగా- తన కోరికను బయటపెట్టేంది?

డిజీవిజీతో మనసు చలించిన లావణ్య ఆడిటికా ప్రభావంతో రెచ్చిపోయిందనీ, రాత్రి లవ్‌ఫ్రాగ్ తాకిడికి పూర్తిగా తనదొతుందనీ సురేష్‌కి అర్థమైంది. ''బాప్‌రే వర్ధన్!'' అనుకున్నాడతడు.

★ ★ ★

రాత్రి తొమ్మిదీ యాభై, అప్పటికే సురేష్ ఇంట్లో అందరూ ఎవరి గదుల్లో వారు నిద్రపోతున్నారు. సురేష్ మంచం దిగాడు. పిల్లిలా అడుగులేసుకుంటూ లావణ్య ఇంటి తలుపుదాకా వెళ్ళాడు. ఇలా తోయగానే అలా తెరుచుకుందా తలుపు. లోపలకెళ్ళి తలుపు మూసాడు.

లావణ్య గదిలో దీపం వెలుగుతోంది. తనుండగా దీపమెందుకూ అన్నట్లు మెరిసిపోతోంది మంచం మీద కూర్చున్న లావణ్య. సురేష్‌ని చూస్తూనే ఆమె చటుక్కున మంచం దిగి నిలబడి, ''రమ్మంటే, వచ్చావ్. థాంక్స్'' అంది.

''పిలిచ్చి గౌరవించావు. ఆ గౌరవం నిలుపుకోవాలని వచ్చాను'' అన్నాడు సురేష్.

''నీ గౌరవం నువ్వు నిలుపుకుంటావనే ఇలా ఏకాంతంలో పిలిచాను. ఇప్పుడు నువ్వు నా సందేహాలు కొన్ని తీర్చాలి. మనమిద్దరమూ భార్యాభర్తలమనుకో. నువ్వు నా నుంచి ఏమాశిస్తావో చెప్పాలి. అడిగింది నేను కాబట్టి ఇన్హిబిషన్స్ లేకుండా చెప్పు'' అందామె.

అంటే ఆమె ఇప్పుడు తనకు భార్య కావాలనుకుంటోందన్న మాట. సురేష్ ఇన్హిబిషన్స్ లేకుండానూ, సభ్యత పరిమితులు దాటకుండానూ ఆమెకు తన మనసులోని మాట చెప్పాడు.

ఆమె వెంటనే, ''చాలా థాంక్స్. ఇప్పుడు నేను మా వారికుత్తరం రాయడం సులభం'' అంది.

తమ దాంపత్య జీవితం గురించి ఆమె కలలేమిటో ఉత్తరం రాయమని భర్త ఆమెకు ఫోన్లో చెప్పాడు. ఆమె ఉత్తరం రాసింది. అది చదివేక, ''నీ ఉత్తరం నన్ను నిరుత్సాహపర్చింది. ఇన్హిబిషన్స్ లేకుండా రాయి'' అని మళ్ళీ ఫోన్లో చెప్పాడు. ఎవరి సాయం తీసుకుందామన్నా ఆమెలో ఇన్హిబిషన్స్. సురేష్ ఇచ్చిన డిజీవిజీ చదివేక ఇన్హిబిషన్స్ తగ్గి అతణ్ణి కలుసుకుంది. అక్కడ ఇన్హిబిషన్స్ ఇంకా తగ్గి అతణ్ణి తన గదికి ఆహ్వానించింది.

''ఈ మాత్రం దానికి గదికి పిలవాలా? నన్ను కలిసినప్పుడే అడిగేయొచ్చుగా'' అన్నాడతడు.

''నిజం చెబుతున్నాను. నిన్ను కలిసినప్పుడు నా మనసెందుకో చలించింది. ఏకాంతముంటే ఏం చేసేదాన్నో అనిపించింది. ఐతే అది నాకు అవమానమనిపించింది. నేను వివాహబంధాన్ని గౌరవిస్తాను. పెళ్ళయ్యేక త్రికరణశుద్ధిగా మా వారినే ప్రేమిస్తున్నానని నమ్మాను. ఆ ప్రేమకు పరీక్ష వచ్చింది. నెగ్గాలన్న పట్టుదలతో నిన్నిలా పిలిచాను. నేను నెగ్గాను. నువ్వింక వెళ్ళొచ్చు.''

''నేను వెళ్ళనంటే?'' అంటూ సురేష్ చేతులు కట్టుకున్నాడు. అతడి కుడిచేతి చూపుడువ్రేలు ఎడమచేతికున్న లవ్‌ఫ్రాగ్ మీటకు తగులుతోంది. అది నొక్కితే లావణ్యే తననక్కణ్ణించి వెళ్ళనివ్వదని అతడికి తెలుసు.

''రమ్మనగానే వచ్చి గౌరవం నిలబెట్టుకున్నావు. పొమ్మనగానే వెళ్ళిపోవడమే గౌరమని నీకు తెలియదనుకోను. ఐనా చేతులు కట్టుకు నిలబడ్డావు. ఆజ్ఞాపించమనేగా!'' అంది లావణ్య.

సురేష్ మీట నొక్కలేదు. చేతులు వదులుగా జారవిడిచి, ''ఐ యామ్ ఆల్వేస్ యువర్ ఫ్రెండ్ అండ్ వెల్ విషర్. ఐ విష్ యూ ఆల్ ది బెస్ట్'' అంటూ ఆమెకు సెల్యూట్ చేసి వెళ్ళిపోయాడు.

★ ★ ★

''మన సంప్రదాయంలో వివాహ బంధం చాలా గొప్పది. పిల్లలు చూడకుండా టీవీలో కొన్ని ఛానెల్సుకి చైల్డ్‌లాక్ ఉన్నట్లే- పెళ్ళైన యువతి తన భర్తకు మాత్రమే అంకితమయ్యేలా వెడ్‌లాక్ పనిచేస్తుంది. తాత్కాలికంగా మనసు చలించినా అనుక్షణం హెచ్చరించే వివేకం ఆ వెడ్‌లాక్‌ని ఆపరేట్ చేస్తూంటుంది. నా వెడ్‌లాక్ కిట్ కంటే బలమైనది పెళ్ళైన ఆడపిల్ల మెదడులోని వెడ్‌లాక్. అందుకే సంప్రదాయాన్ని నమ్మిన ఆడపిల్ల తప్పు చెయ్యదు, చెయ్యనివ్వదు. ఆ విషయం మరోసారి ఋజువైనందుకు సంతోషించి ధవళను పెళ్ళి చేసుకో'' అన్నాడు వర్ధన్ నవ్వుతూ.

''ఆడపిల్ల, ఆడపిల్ల అంటూ ఆడవాళ్ళని తెగ పొగిడేస్తున్నావు. సంప్రదాయాన్ని నమ్మిన లావణ్య తప్పుకు సిద్ధపడితే మగాణ్ణయుండీ నేనే నిగ్రహం పాటించి ఆమె తప్పు చేయకుండా రక్షించాను. అసలప్పుడు నేను లవ్‌ఫ్రాగ్ మీట నొక్కితే ఏమయ్యేది?'' అన్నాడు సురేష్.

''ఐతే నీకు వెడ్‌లాక్ కిట్ గురించి పూర్తిగా చెప్పాలి'' అన్నాడు వర్ధన్. ''మన దేశంలో ఆడవాళ్ళకు చొరవ తక్కువ, సంకోచం ఎక్కువ కావడం వల్ల ఎందరో దంపతులకీ వెడ్‌లాక్ కిట్ గొప్ప వరం కాగలదనుకున్నాను. ఐతే మెజారిటీ పురుషులు దీన్ని దుర్వినియోగం చేసే అవకాశముంది. అందుకని ఈ కిట్లో మగువలను రెచ్చగొట్టే ఏర్పాట్లతో పాటే పురుషుల మనోనిగ్రహాన్ని అపరిమితంగా పెంచే ఏర్పాట్లూ చేసాను. ఇది వాడిన పురుషుడు- భార్య రెచ్చగొడితే లొంగుతాడు. చేతికి లవ్‌ఫ్రాగ్ ఉండగా భార్యకాని స్త్రీ జోలికి- ఆమె రెచ్చగొట్టినా కూడా -వెళ్ళనుగాక వెళ్ళడు. నీ నిగ్రహం నీ గొప్పతనం కాదు, నా అనుగ్రహమని తెలుసుకో'' అన్నాడు.

తానెందుకు లవ్‌ఫ్రాగ్ మీట నొక్కలేకపోయాడో అప్పుడు తెలిసింది సురేష్‌కి. ''నన్నదుపు చేయడానికి నీ వెడ్‌లాక్‌లో ఎలక్ట్రానిక్ సిస్టం పెట్టావు. కానీ మన సంప్రదాయం ఆడపిల్లలకి ఆటోమాటిక్ వెడ్‌లాక్ పెట్టేంది. దటీజ్ గ్రేట్'' అన్నాడతడు.

ధవళతో తన పెళ్ళి శుభలేఖనిద్దామని సురేష్ వెళ్ళినరోజునే లావణ్య అమెరికా ప్రయాణానికి సిద్ధమౌతోంది.

☆